## క్లుప్తంగా

### 19 నుంచి రైతులకు శిక్షణ

**మైదుకూరు :** పసుపు పంట సాగుపై ఈనెల 19 నుంచి రెండు రోజులపాటు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పసుపు సాగులో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు శిక్షణ ఇస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### క్లాప్ డ్రైవర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు, యూనియన్ నాయకులు

**ప్రొద్దుటూరు :** స్థానిక 3వ వార్డు సచివాలయం వద్ద ఆదివారం ఏపీ క్లాప్ డ్రైవర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 37 మంది క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి రూ.18,500 వేతనాలు ఇవ్వాలని, సెలవులు, మంజూరు చేయాలని, వెహికల్ రిపేరు చేయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని కోరారు. రాజ్‌కుమార్, నరేష్, కిరణ్‌బాబు, పవన్, భాస్కర్‌రావు, రాజేష్, సునీల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆశా కార్యకర్తల...**

**చాపాడు:** మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

### ఉత్సాహంగా క్రాస్ కంట్రీ పోటీలు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక కొర్రపాడురోడ్డులోని టీవీఆర్ హైస్కూల్ వద్ద బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా జరిగాయి. 16 ఏళ్లలోపు బాలుర 2కిలోమీటర్ల విభాగంలో గంగాధర్, 18 ఏళ్లలోపు 6 కిలోమీటర్లలో నవరాజ్, భానుప్రకాష్‌రెడ్డి, విష్ణు, బ్రహ్మం, పురుషుల 10 కిలోమీటర్ల విభాగంలో సింహాచలం, 16 ఏళ్ల బాలికల 2కిలోమీటర్ల విభాగంలో అశ్విని ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24న సామర్లకోటలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలను వ్యాయామ సంచాలకులు వెంకటసుబ్బయ్య, అంకారావు, చరణ్‌కుమార్ రెడ్డి, నాగేశ్వరరావు, బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మద్‌బాషా పర్యవేక్షించారు.

### అన్నదానం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక వసంతపేటలోని శ్రీ షిర్డీసాయిబాబ ఆలయం శ్రీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహారాష్ట్ర షిర్డీ సాయిబాబా మందిరం సమీపంలో 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు. రెండేళ్లుగా ప్రతి ఏడాది డిసెంబర్‌లో షిర్డీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎం.పుల్లారెడ్డి, వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన సాయిబాబ దీక్షధారులు, భక్తులు పాల్గొన్నారు.

### దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

**కాశినాయన :** మండలంలోని ఆర్సీఎం పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 150 మంది వృద్ధులకు పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమాస్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సంస్థ ప్రతినిధులు ఎల్.ప్రసాద్‌రెడ్డి, జి.శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వృద్ధులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలో కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దుస్తులు పంపిణీ చేసినందుకు విచారణ గురువు ఫాదర్ జయరాజు, వృద్ధులు సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### నేడు కార్డుల పంపిణీ

**చాపాడు:** వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీని కార్యక్రమాన్ని సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం సభాభవనంలో నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం హాజరుకావాలని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు.

# పార్కు సుందరీకరణకు కృషి

**భూమి పూజలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

**ప్రొద్దుటూరు :** హౌసింగ్ బోర్డు కాలనీ పార్కును సుమారు రూ.5కోట్ల వ్యయంతో నిర్మిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా నిర్మించనున్న పార్కుకు ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలు ఆవిర్భావం నుంచి వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రతి ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా తీర్పు ఇస్తున్నారన్నారు. అదే అభిమానంతో తాను కాలనీకి రూ.70లక్షలతో తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరిగేటప్పుడు ప్రజలు అడిగిన వెంటనే రూ.2 కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మించామన్నారు. ఈ ప్రాంతంలోనే త్వరలో రామాలయం నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. అదే విధంగా ప్రస్తుతం ప్రజల కోరిక మేరకు పార్కును నిర్మిస్తున్నామన్నారు. సాధారణంగా ఒక పంచాయతీలో ఇంత డబ్బు వెచ్చించి పార్కును నిర్మించడం జరగదని, అయితే తాను ప్రజల కోసం ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ప్రస్తుతం రూ.2.40 కోట్లు నిధులు మంజూరయ్యాయని, మిగతా డబ్బును మంజూరు చేయించి ఎన్నికల నాటికి పార్కును పూర్తి చేస్తామన్నారు. ఈ పార్కు మున్సిపల్ గాంధీ పార్కు కంటే అందంగా ఉంటుందన్నారు. ఇందులో వాకింగ్ ట్రాక్, జిమ్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చౌటపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రాచమల్లు కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామన్నారు. అర్కటవేముల–సోమాపురం మధ్య కాజ్‌వే నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, సర్పంచ్ గద్దా మోషా, మాజీ సర్పంచ్ దేవీప్రసాద రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఎంపీటీసీ వసుంధర, అజీం, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, మేరి, ఉపాధ్యాయులు కొండయ్య, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్

**ప్రొద్దుటూరు :** స్థానిక గోకుల్ నగర్‌లోని ఎస్‌పీజీ–2 చర్చిలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టరేట్ కమిటీ చైర్మన్ రెవరెండ్ కోలాటి రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యేసు క్రీస్తును నమ్మకంతో ప్రార్థించాలని సూచించారు. అనంతరం ఆయన క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని, మానవాళికి క్రీస్తు చూపిన శాంతి మార్గాన్ని వివరించారు. చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల క్రిస్మస్ ట్రీ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు క్రీస్తు పాటలు పాడారు.



20 అడుగుల క్రిస్మస్ ట్రీ



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

# సనాతన ధర్మాన్ని తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జయరాములు

**పోరుమామిళ్ల:** సనాతన ధర్మాన్ని గురించి ప్రతి హిందువు తెలుసుకోవాలని, హైందవ ధర్మానికి జరిగే నష్టాల పట్ల సంవేదన భావన కలిగి ఉండాలని మాజీ శాసన సభ్యులు జయరాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అయోధ్య రామ మందిర అక్షింతలు మండలంలోని అన్ని గ్రామాలకు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40 గ్రామాలకు చెందిన రామభక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు బాలరంగయ్య, రమణయ్య, వెంకట రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, చెన్నయ్య, నాగేంద్ర, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి

**రాజుపాళెం :** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని నియోజకవర్గ బీసీ కన్వీనర్ రవీంద్ర పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం రవీంద్రతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి జగనే మా నమ్మకం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. జరగబోవు ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని గెలిపించుకోవాలని ఆయన చెప్పారు. పార్టీ నాయకులు గంగయ్య, నాగేశు, సుధాకర్ పాల్గొన్నారు.

# ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

**బద్వేలు అర్బన్ :** స్థానిక గాండ్లవీధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం పెన్షనర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల పితామహుడు డి.ఎస్.నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు శీలంగంగన్న మాట్లాడుతూ ఉద్యోగులు విరమణ పొందిన తర్వాత సమాజంలో గౌరవంగా ఉండేందుకు పెన్షన్ ఎంతో అవసరమని భావించి అందుకోసం పోరాడిన డి.ఎస్.నకారను ప్రతి విశ్రాంత ఉద్యోగి స్మరించుకోవాలని కోరారు. అసోసియేట్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, ట్రెజరర్ మహేంద్రప్రసాద్, సభ్యులు సత్యబాబు, సయ్యద్ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో...**

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే సందర్భంగా కడపలో నిర్వహించిన కార్యక్రమంలో బద్వేలు ప్రాంతానికి చెందిన 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు జి.పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆనందరావు, రామసుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న అధికారులు

**చాపాడు:** మండలంలోని రాజువారిపేట, అయ్యవారిపల్లె గ్రామాలలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు సంచార వాహనంపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీధర్‌నాయుడు, డ్వాక్రా ఏపీఎం వెంకటరమణ స్థానిక ప్రజాప్రతినిధులు, మండల ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైష్ణవాలయాల్లో వైభవంగా పూజలు

**ప్రారంభమైన ధనుర్మాస కార్యక్రమాలు**



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

**కడప కల్చరల్ :** జిల్లాలోని వైష్ణవాలయాలలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ మాసం ప్రారంభం సందర్భంగా ఆదివారం ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు అభిషేకాలకు హాజరయ్యారు. తొలిమంచు వేళలో సూర్యకిరణాలు భూమాతను స్పర్శిస్తున్న ఘడియల్లో భక్తిభావంతో వచ్చే ప్రజలతో ఆలయాలు కళకళలాడాయి. వైష్ణవ ఆలయాలలో తిరుప్పావై పూజలు ప్రారంభించారు. ఉదయం స్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం సూర్యోదయానికి ముందే సామూహికంగా విష్ణు సహస్ర నామా పారాయణాలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు ప్రత్యేకంగా పగలు పత్తు కార్యక్రమంలో భాగంగా గోదాదేవి తిరుప్పావై పాశురాల పారాయణం చేశారు. అనంతరం నివేదన, నక్షత్ర కుంభ హారతులు, చతుర్వేద స్వస్తి, భజనలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

**దేవునికడపలో..** దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4.30 గంటలకే పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపుగల శ్రీ ఆండాళ్ అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజు ఒకటి చొప్పున పాశురాలను గానం చేయడంలో భాగంగా పండితులు తొలి పాశురాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరికొన్ని వైష్ణవాలయాలలో కూడా ప్రతి రోజు 30 పాశురాలను ఆలపిస్తారు.

**శ్రీ లక్ష్మీసత్యనారాయణ ఆలయంలో..** కడప నగరం గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, దేవతామూర్తులకు అలంకారం, ఆరాధన నిర్వహించారు. పాశురాల ఆలాపన, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా పాశురాల పారాయణం చేశారు. అనంతరం వారందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలు 30 రోజులపాటు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

**ఇంకా..** కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, జవుళి బజారు (బీకేఎం వీధి) శ్రీ కోదండ రామాలయం తదితర వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జవుళి బజారు రామాలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేద పండితుల ఆధ్వర్యంలో పాశురాల గానం, ధనుర్మాసం విశిష్టతలపై ప్రసంగాలు చేశారు.

# నేడు జగనన్న ఆరోగ్య సురక్ష-2 ప్రారంభం

**గోపవరం :** జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించి తన అమూల్యమైన సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేయనున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. మండల స్థాయిలో అన్నిశాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు, సచివాలయ స్థాయిలో సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, వలంటీర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించాలని కోరారు. ఉదయం 11 గంటలకల్లా స్థానిక తహసీల్దారు కార్యాలయంతో పాటు అన్ని సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది సిద్ధంగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తిరుప్పావై పాశురాలను పఠించారు. వేకువజామున శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. శ్రీకృష్ణుడు గోదాదేవిలకు ప్రత్యేక పూజాలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.

## గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దు

**ప్రొద్దుటూరు క్రైం :** గుండె జబ్బులను ఎవ్వరూ అశ్రద్ధ చేయొద్దని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. నెహ్రూ రోడ్డులోని లక్ష్యా కార్డియాక్, కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి 40 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 21 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి గుండె స్కానింగ్ చేశారు. గుండె సమస్యలున్న వారికి చికిత్సకు సంబంధించి సూచనలు ఇచ్చారు. అలాగే డాక్టర్ హరిత 32 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా మూడవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

# ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు



మాట్లాడుతున్న వైవీయూ పీడీ కె.రామసుబ్బారెడ్డి



కబడ్డీ పోటీలకు హాజరైన క్రీడాకారులు

**కడప కల్చరల్ :** సంక్రాంతి పండుగ సందడి ప్రారంభమైంది. కడప నగరానికి చెందిన రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏడు రకాల గ్రామీణ రకాల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా పది బృందాలు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహ భరితంగా పోటీలు సాగాయి. వైవీయూ పీడీ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి కార్యక్రమాలను సమన్వయం చేశారు. సేవా సమితి కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలకు ముందు సభా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామసుబ్బారెడ్డి వ్యాయామం ద్వారా బాలలు, యువతకు ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పురాణాలలో క్రీడలకు ఇచ్చిన ప్రాధాన్యత గురించి ఆయన సోదాహరణంగా వివరించారు. సంస్థ అధ్యక్షులు కె.నాగిరెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న ప్రాచీన, గ్రామీణ క్రీడలను నేటి తరానికి పరిచయం చేసేందుకు ఈ సందర్భాన్ని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి, శివశివాని హైస్కూలు కరస్పాండెంట్ కె.నాగేంద్రారెడ్డి, ఎల్.నాగిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, శివనారాయణ, మద్దిక సుబ్బారెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి కూడా గ్రామీణ క్రీడల రక్షణ అవసరం గురించి, సంక్రాంతి సంప్రదాయాల గురించి మాట్లాడారు. లెక్కల కొండారెడ్డి తన ప్రసంగంలో ఈనెల 24న సంక్రాంతి గ్రామీణ క్రీడా సంబరాల్లో భాగంగా కర్రసాము, చెక్కభజన, టగ్ ఆఫ్ వార్, కోలాటం పోటీలు నిర్వహిస్తామని, సంవత్సరాంతం రోజు డిసెంబరు 31న మహిళలకు ముగ్గుల పోటీలు, జనవరి 7న బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13న విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

# ● జొన్న కంకి నవ్వింది.. పిట్ట వచ్చి వాలింది..





సాగు చేసింది మొదలు.. పంట చేతికందేవరకు రైతన్నకు కంటిమీద రెప్ప పడదు. ఓ సారి వానలు భయపెడతాయి... మరోసారి చీడపీడలు చుట్టుముడతాయి.. ఈ గండాలన్నీ దాటుకుని చేను నవ్విందంటే.. అదును చూసి పక్షులు వాలిపోతాయి. ఏంచక్కా మాటు వేసి ఇదిగో ఇలా కంకి కంకికి కాటు వేసి ఖాళీ చేస్తాయి. అందుకే పక్షుల తాకిడి నుంచి జొన్న పంటను కాపాడుకోవడానికి రైతన్నలు ఎన్నెన్నో పాట్లు పడుతున్నారు. రాజుపాళెంలో జొన్న సాగు చేసిన రైతులకు పంటపై పక్షులు వాలకుండా శబ్దం చేస్తూ పిట్టలను పారదోలడమే పనైంది. ప్రస్తుతం జొన్న కంకి గింజ బాగా కావడంతో పక్షుల దృష్టి ఆకర్షిస్తోంది. దీంతో పక్షులు వాలకుండా శబ్దాలు చేస్తూ వాటిని వెళ్లగొట్టే పనిలో రైతులు మునిగితేలుతున్నారు. –రాజుపాళెం